మార్కెట్‌యార్డు వినియోగమెప్పుడో?

- రూ.కోట్లు వెచ్చించి గిడ్డంగుల నిర్మాణం
- భవనాలు ఇతర శాఖలకు వినియోగం
- నేటికి కొనుగోళ్లకు నోచుకోని వైనం

గార్ల: రైతు శ్రేయస్సును కాంక్షించి గార్లలో మార్కెట్ యార్డ్‌ను 1991 సంవత్సరంలో నిర్మించినా, అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ మార్కెట్‌యార్డ్‌లో పంటల కొనుగోళ్లు, వ్యాపార లావాదేవీలు జరగకపోవడం విచారకరం. మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతులకు ఉప యోగం లేకుండా మార్కెట్ గిడ్డంగి భవనాలను ఇతర ప్రభుత్వ శాఖలు వాడుకుంటున్నాయి. గార్ల లో చిల్లర కౌంటర్లలో, కిరాణం దుకాణాల్లో లైసెన్స్‌లు లేకుండా వ్యాపారులు పంటలను తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తున్నా, మార్కెట్ అధికారులు వచ్చి నెలవారి మామూళ్లు దండుకొని వెళ్తారే తప్ప, గార్ల లోని మార్కెట్‌యార్డు గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

గార్ల, కారేపల్లి, బయ్యారం మండలాలకు రైతులకు ఉపయోగపడే విధంగా 1991లో రూ.8లక్షల వ్యయంతో గార్లలో మార్కెట్‌యార్డు, గిడ్డంగులు, రైతు విశ్రాంతి భవనం నిర్మించారు. ఈ మార్కెట్ యార్డ్ నాటి నుంచి నేటి వరకు నిరుపయోగంగా ఉంది. నిరుపయోగంగా ఉన్న ఈ మార్కెట్‌యార్డ్‌కు 2010లో మార్కెట్ శాఖ మరో రూ.5లక్షలు వెచ్చించి శిథిలమైన గిడ్డంగి రిపేరు, మంచినీటి కోసం వాటర్ ట్యాంక్, పైపులైన్, విద్యుత్ సౌకర్యం, రైతులు ధాన్యాన్ని ఆరబోసేందుకు సీసీ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. 2013లో తిరిగి మార్కెట్‌శాఖ రూ.1.47 కోట్లు వెచ్చించి రెండు నూతన గిడ్డంగి భవనాలు నిర్మించింది. ప్రతీ ఏటా మార్కెట్‌శాఖ గిడ్డంగులకు మెయింటనెన్స్ పేరుతో లక్షల రూపాయలు వృథాగా ప్రభుత్వ సొమ్ము వెచ్చిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇన్ని సౌకర్యాలు కల్పించినా నేటికీ గార్ల మార్కెట్‌యార్డులో కొనుగోళ్లు చేపట్టక పోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా మార్కెట్ శాఖా అధికారులు స్పందించి గార్లలోని మార్కెట్ యార్డును ప్రారంభించి, పంటల కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


నిరుపయోగంగా షెడ్డు


పారసరఫరా శాఖ గోదాంగా వాడుకుంటున్న గిడ్డంగి

కొనుగోళ్లు ప్రారంభించాలి


లక్షలు వెచ్చించి మార్కెట్ నిర్మించారు, కాని నేటికీ మార్కెట్‌లో పంటల కొనుగోళ్లు చేపట్టడంలేదు. దీంతో మండలంలో వ్యాపారులు దుకాణాల వద్ద చెప్పిన ధరకే పంటలను అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నాం. మార్కెట్‌లో వ్యవసాయ పంటల కొనుగోళ్లు ప్రారంభించి తాము పండించిన అన్ని పంటలను కొనుగోలు చేయాలి.

- ధరావత్ సక్రు, రైతు, సేరిపురం

సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ అర్బన్: 15 సంవత్సరాలుగా విద్యాశాఖలో అనుసంధనంలో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష ఉద్యోగుల శనివారం నిరసన దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కన్న, వెంకన్న, రామకృష్ణ, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీకి సమగ్రశిక్ష ఉద్యోగులు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జంజరాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ, లునావత్ మాంజీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన


ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కేసముద్రం: కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం ధాన్యం అమ్ముకునే రైతులకు, బోనస్ వెంటనే చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య డిమాండ్ చేశాడు. శనివారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం నాయకులు సందర్శించారు. దాన్యం కొనుగోలు చేసిన వెంటనే బోనస్ చెల్లించాలన్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల కట్టయ్య, ఉప్పలయ్య, చంద్రయ్య, వీరన్న పాల్గొన్నారు.

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి

- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్


మాట్లాడుతున్న రాంబాబునాయక్

నెహ్రూసెంటర్: లంబాడీలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ అన్నారు. సేవాలాల్‌సేన ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారగ్ జోల్ యాత్ర శనివారం మహబూబాబాద్‌కు చేరుకుంది. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లంబాడీల ఓట్లతో గెలిచిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లంబడీలను మోసం చేస్తుందని అన్నారు. రైతులకు బేడీలు వేసి వారిపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. లంబాడీల హక్కుల సాధనకోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాందాస్, రవి, మంగీలాల్, రాంజారాం, రేఖనాయక్, చిట్టిబాబు పాల్గొన్నారు.

వీఓఏపై చర్య తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

బయ్యారం: రుణాల మంజూరు, రికవరీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన బాలాజీపేట వీఓఏ వసంతపై అధికారులు విచారణ నిర్వహించి, చర్య తీసుకోవాలని గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు అధికారులను కోరారు. వీఓఏ అవినీతికి పాల్పడి తమ నుంచి అక్రమంగా డబ్బులు కాజేసిందని ఆరోపిస్తూ మహిళలు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వీఓఏ అక్రమాలకు పాల్పడిందని తాము ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు తమకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. గ్రామానికి చెందిన 110మంది మహిళల నుంచి అక్రమంగా వీఓఏ డబ్బులు వసూలు చేసిందన్నారు. తాము అధికారులకు ఫిర్యాదు చేసిన వెంటనే ఇందులో ఐదుగురికి రూ.3,150 చొప్పున ఫోన్‌పే చేసి మిగతా వారికి చేయలేదన్నారు. వీఓఏ ను విధుల నుంచి తొలగించి, డబ్బులను ఇప్పించాలని మహిళలు కోరారు. కార్యక్రమంలో సుగుణ, లక్ష్మి, పద్మ, ఝాన్సి, శిరీష, ఎర్రమ్మ పాల్గొన్నారు.

కొత్త మెనూతో ఆరోగ్యానికి మేలు

- కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్
- న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభం

ప్రభుత్వ హాస్టళ్లలో శనివారం అధికారులు, నాయకులు డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు మెనూ ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ముత్యాలమ్మ గూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందించే దిశగా అధికారులు ముందుకు వెళ్లాలన్నారు. కొత్త మెనూతో విద్యార్థుల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. - సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్ అర్బన్: మెనూ ప్రారంభిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్


మానుకోట గిరిజన వసతి గృహంలో భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు


కురవి: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులలో కలిసి భోజనం చేస్తున్న అధికారులు


కేసముద్రం: అమీనాపురంలో ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి


గార్ల: మాట్లాడుతున్న డీపీఓ హరిప్రసాద్


తొర్రూరు: బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీఏ విజయ్‌చందర్


దంతాలపల్లి: ఎంజేపీ పాఠశాలలో మెనూ ప్రారంభిస్తున్న అధికారి వీరన్న

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న తాళ్లపల్లి కృష్ణగౌడ్

గార్ల: నిరుపేదల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయం అని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ అన్నారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు రుణమాఫీ, సన్నధాన్యం క్వింటాకు రూ.500ల బోనస్, పేదలకు రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తుచేశారు. త్వరలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకడు గుండా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్, హతీరాం, యాకూబ్‌పాషా, రాము, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన


రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందిన ఫిజికల్ డైరెక్టర్ గుగులోతు వీరన్న కుటుంబానికి నాయం చేయాలని జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయ సమీపంలో శనివారం మృత దేహంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా టౌన్, రూరల్, డోర్నకల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, రాజేశ్ బందోబస్తు నిర్వహించారు. మృతుడి భార్య తార మాట్లాడుతూ.. తన భర్త వీరన్న చావుకు కారకులైన ప్రిన్సిపాల్ సురేందర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్సీఓడీఎస్ వెంకన్న తమ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని అయన హామీ ఇచ్చారు. ఆందోళనకు ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్ నాయక్, సంఘం జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి మద్దతు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నెల్లికుదురు: ఖమ్మంలోని ఓ వివాహ వేడుకల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై చిర్ర రమేష్ బాబు బాధితుడికి అందించాడు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన అశోక్ ఓ వివాహ వేడుకల్లో లక్ష రూపాయల విలువ చేసే సెల్‌ఫోన్‌ను నెల రోజులు క్రితం పోగొట్టుకున్నాడు. అశోక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసు సిబ్బంది సెల్‌ఫోన్ కనిపెట్టి బాధితుడికి అందజేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్: మండలంలోని వెంకటగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహబూబాబాద్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సల్లగట్టు హరిబాబు(46) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొన్నాళ్ల క్రితం భార్య నుంచి విడిపోయిన హరిబాబు మరో మహిళతో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈనెల 11న జమాండ్లపల్లిలోని బంధువుల ఇంట్లో వేడుకకు స్నేహితులతో కలిసి ఆటోలో వచ్చిన ఆయన అదేరోజు రాత్రి హుజూర్‌నగర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో వెంకటగిరి వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరిబాబుకు చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అయితే, తన భర్త మృతిపై అనుమానం ఉందని ఆయన భార్య శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ సీఐ ముష్క రాజు తెలిపారు.

విద్యుత్‌శాఖలో ప్రమోషన్ల లొల్లి

నెహ్రూసెంటర్: విద్యుత్‌శాఖలో చేపట్టిన ఉద్యోగుల ప్రమోషన్ల విషయంలో గందరగోళం నెలకొంది. జిల్లాలో ప్రమోషన్ల ఇవ్వాల్సి ఉన్నప్పటికీ వారికి ఇవ్వకుండా విద్యుత్‌శాఖ జిల్లాస్థాయి అధికారులు అడ్డుకుంటున్నారని విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. ఎలాంటి కోర్టు కేసులు లేకపోయిన వాటిని అడ్డుగా చూపుతూ ప్రమోషన్లకు సంబంధించిన ఆర్డర్లను నిలిపివేస్తున్నారని ఉద్యోగులు తెలుపుతున్నారు. జిల్లాలో ఇద్దరు ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కోర్టు కేసు విషయమై క్లారిఫికేషన్ కావాలంటూ అధికారులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమోషన్ల విషయంలో కోర్టు నుంచి అనుమతి తీసుకువచ్చినప్పటికీ అడ్డుకుంటున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ప్రమోషన్ల విషయమై ఉన్నతాధికారులకు తెలియజేశామని క్లారిఫికేషన్ రాగానే ఆర్డర్లను అందజేస్తామని చెప్పడం ఆందోళనను విరమించారు. అయితే ప్రమోషన్ల విషయంపై కోర్టులో కేసు ఉందని అది క్లియర్ కాగానే అర్హత ఉన్నవారికి ప్రమోషన్ ఇస్తామని ఎస్ఈ నరేష్ తెలిపారు. అయితే అర్హత లేకపోయినా ప్రమోషన్ కోసం కోర్టు కెళ్లిన విషయం తెలిసినా అధికారులు తమకు కావాలనే ఆర్డర్లు ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సంస్థనే నమ్ముకొని సంవత్సరాల తరబడి పనిచేస్తున్న తమకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

తొమ్మిదేళ్ల తర్వాత కుటుంబం చెంతకు..



రమణను కుటుంబీకులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మం అర్బన్: మతిస్థిమితం కోల్పోయిన మహిళకు చికిత్స చేయించి ఆమె కోలుకున్నాక కుటుంబీకులకు అప్పగించిన వైనమిది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలెం బంజరకు చెందిన తురక రమణ మతిస్థిమితం కోల్పోయిన పరిస్థితుల్లో తొమ్మిదేళ్ల క్రితం ఖమ్మంలో తిరుగుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అన్నం ఫౌండేషన్‌లో చేర్పించారు. ఇన్నాళ్లు ఆమెకు వైద్యం అందిస్తుండగా ఇటీవల కోలుకోవడంతో వివరాలు ఆరా తీస్తే కుటుంబ వివరాలు వెల్లడించింది. ఆమె తల్లిదండ్రులది ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం కావడంతో వారికి సమాచారం ఇవ్వగా తల్లి, కుటుంబీకులు శనివారం ఫౌండేషన్‌కు వచ్చి బిడ్డను గుండెలకు హత్తుకున్నారు. కాగా, 20ఏళ్ల క్రితం అమ్మపాలెం బంజరకు చెందిన వ్యక్తితో రమణకు వివాహం కాగా ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. పెళ్లయిన ఐదేళ్లకు మతిస్థిమితం కోల్పోవడంతో అప్పటి నుంచి తల్లి వద్దే ఉంటున్న ఆమె తొమ్మిదేళ్ల క్రితం తప్పిపోగా ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. చివరకు అన్నం ఫౌండేషన్ బాధ్యులు శనివారం ఆమెను తల్లి, సోదరికి అప్పగించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశాడు. ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో నిర్వహించే కార్యక్రమానికి కార్మికులంతా కదలిరావాలని పిలుపునిచ్చారు.

గ్రామాలల్లో సీపీఎం ఇంటింటి సర్వే

కురవి: అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం అందజేసే పథకాలను వర్తింపజేయాలని సీపీఎం నాయకులు గంధసిరి శ్రీనివాస్, పిట్టల వెంకన్న, నల్లపు సుధాకర్ అన్నారు. శనివారం కురవి, బలపాల, సూదనపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్ల కృష్ణయ్య, ఆమెడ నాగయ్య, జ్యోతిబసు, వీరేందర్, వీరలక్ష్మి, మోహన్‌రావు, దర్గయ్య, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్


దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తొర్రూరు: పేదలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచన మేరకు బీఆర్ఎస్ నాయకులు శనివారం పట్టణంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, కౌన్సిలర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాస్, నాగరాజు, జంపా పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధికి దూరంలో తండాలు



దంతాలపల్లి: గిరిజన తండాలు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పడినప్పటికీ ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్యం వలన అభివృద్ధికి దూరంలో ఉన్నాయని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భుక్య హరినాయక్ అన్నారు. శనివారం మండలంలోని తూర్పుతండా, మేగ్యతండా, రేఖ్యతండాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవి నాయక్, వసుంధర్, విజయ్, హరికృష్ణ, వస్రాంనాయక్ పాల్గొన్నారు.

పల్టీకొట్టిన వాహనం

ముగ్గురికి గాయాలు



మరిపెడ రూరల్: బొలేరో వాహనం గుంతలో పడి పల్టీ కొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని స్టేజితండా గ్రామ పంచాయతీ పరిధిలోని కుడియాతండా సమీపంలో ఖమ్మం-వరంగల్ 563 జాతీయ రహదారి శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. బొలేరో వాహనం కరీంనగర్ నుంచి వయా మరిపెడ మీదుగా ఖమ్మం వైపు వెళ్తోంది. ఈ క్రమంలో కుడియాతండా సమీపంలోని జాతీయ రహదారిపై గుంతలో పడి పల్టీ కొట్టింది. వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారి పూర్తి వివరాలు తెలియరాలేదు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

గార్ల: మన ఊరు-మన బడి పథకం ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో కొన్ని గ్రామాల్లో విద్యార్థులకు తరగతి గదులు సరిపోక ఆరుబయట చెట్ల కింద విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యాధికారి స్పందించి పెండింగ్‌లో ఉన్న పాఠశాలల మరమ్మతు పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మజ్దూర్ యూనియన్ సంబురాలు



డోర్నకల్: రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ ఘన విజయం సాధించడంతో సంఘం నాయకులు సంబురాలు జరుపుకున్నారు. యూనియన్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ చరణ్‌నాయక్, సెక్రెటరీ అంజియాదవ్, ట్రెజరర్ శోభన్‌ప్రసాద్, వైస్ చైర్మన్లు అరుణ్, నాగేశ్వర్‌రావు, వీరన్న, సుందరయ్య పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు గ్రామంలోని పురాతన శివాలయంలో గుర్తు తెలియని కొంత మంది వ్యక్తులు గుప్త నిధుల కోసం శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలు చేపట్టారు. ప్రధానంగా శివాలయంలోని నంది విగ్రహం వెనుక భాగంలో పెద్ద గుంతాలను తీశారు.

గిరిజన ఆవాసాలకు విద్యుత్ సరఫరా

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో 74 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించామని సర్కిల్ సూపరింటెండెంట్ జె.నరేష్ శనివారం తెలిపారు. ఎస్టీఎస్డీఎఫ్ నిధుల నుంచి విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని మారుమూల గిరిజన పల్లెలకు విద్యుత్ అందించాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.